సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 4 । ఆగస్టు । 2025



మల్చింగ్ సాగు.. బాగు

చీడపీడల నివారణకు, తక్కువ నీటి తడులతో దిగుబడి సాధించేలా రైతులు మల్చింగ్ సాగుపై దృష్టి సారిస్తున్నారు. 8లో



పోడు భూములు పచ్చగా..

పోడు భూములను ఉద్యాన వనాలుగా మార్చేందుకు ప్రభుత్వం ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని రూపొందించింది. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 24°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా మారుతుంది. మధ్యాహ్నం ఉక్కపోత వాతావరణం ఉండవచ్చు.

న్యూస్‌రీల్

శ్రీకనక దుర్గమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనక దుర్గమ్మతల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తలనీలాలు సమర్పించారు. ఒడి బియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకులు అభిషేకం జరిపారు. ఈఓ ఎన్.రజనీ కుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని పీఓ పేర్కొన్నారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై లిఖిత పూర్వకంగా అర్జీలు అందజేయాలని సూచించారు.

కోయ భాషలోనే ఆదివాసీ దినోత్సవ ఆహ్వాన పత్రిక

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజనుల మాతృ భాషను పరిరక్షించేందుకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ఆహ్వాన పత్రికను కోయభాషలో ముద్రించినట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యువత శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను కోయ భాష లిపితో తెలుగులో ముద్రించి పంపిణీ చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ నెల 9న ఐటీడీఏ కార్యాలయంలో జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ ఆహ్వాన పత్రికలను కోయ భాష లిపితో తెలుగులో ముద్రించి, మంత్రులతో ఆవిష్కరింపజేసినట్లు వివరించారు. రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, కమిషనర్లు, స్పెషల్ కార్యదర్శులు, కలెక్టర్లకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

నీట్-పీజీకి కేరళ అభ్యర్థులు



అభ్యర్థుల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

పాల్వంచ/సుజాతనగర్: వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్‌కు కేరళ అభ్యర్థులు జిల్లాలో హాజరయ్యారు. ఆదివారం దేశవ్యాప్తంగా నీట్ పీజీ పరీక్ష నిర్వహించారు. కేరళ రాష్ట్రంలో నిఫా వైరస్ వ్యాప్తి కారణంగా పరీక్ష కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుజాతనగర్‌లోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 119 మందికిగాను 85 మంది పరీక్షకు హాజరయ్యారు. 34 మంది గైర్హాజరయ్యారు. పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 100 మంది విద్యార్థులకుగాను 47 మంది పరీక్ష రాశారు. 53 మంది గైర్హాజరయ్యారు. కేరళతోపాటు తమిళనాడు తదితర రాష్ట్రాల అభ్యర్థులు కూడా పరీక్ష రాశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్థానిక పోరుకు సిద్ధం!

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ పోరులో క్షేత్రస్థాయిలో తమ బలం పెంచుకునేలా వ్యూహాలను రచిస్తున్నాయి. ఇప్పటికే సీపీఐ ఆ దిశగా కసరత్తు చేస్తుండగా తాజాగా బీజేపీ సైతం కార్యకర్తల్లో జోష్ నింపింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం



ఎన్నికలకు సమాయత్తమవుతున్న రాజకీయ పార్టీలు

- కాంగ్రెస్ పొత్తు ధర్మాన్ని పాటించాలంటూ సీపీఐ డిమాండ్
- క్షేత్రస్థాయిలో బలం పెంచుకునే పనిలో భారతీయ జనతా పార్టీ
- ఏ క్షణమైనా ఎన్నికలకు సిద్ధమేనంటున్న కాంగ్రెస్ శ్రేణులు

మిత్రధర్మం పాటించాలి...

2023 అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ కలిసి పోటీ చేశాయి. ఈ క్రమంలో కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి హోదాలో ఉన్న కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ప్రభుత్వానికి మిత్ర పక్షంగా ఉండటంతో పాటు వామపక్ష పార్టీల గొంతు అసెంబ్లీ వినిపించే అవకాశం సీపీఐకి వచ్చింది. ఈ రెండు కలిసి వచ్చి మరోసారి జిల్లాలో సీపీఐ తన బలాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడింది. దీంతో అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే మిత్ర ధర్మం పాటిస్తూ తమకు బలం ఉన్న చోట ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇవ్వాలని అధికార కాంగ్రెస్ ముందు డిమాండ్ పెట్టింది. జిల్లాలో అనేక గ్రామాల్లో తమకు పట్టుందని పేర్కొంటోంది. గత ఎన్నికల్లో గెలుపు సాధించామని గుర్తు చేస్తోంది. ఇవే విషయాలను ఇటీవల జరిగిన సీపీఐ సంస్థాగత సమావేశాల్లో కూనంనేని, జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా వెల్లడించారు. స్థానిక ఎన్నికల్లో తమకు న్యాయం జరగకపోతే చూస్తూ ఊరుకోబోమని అంటున్నారు.

క్షేత్రస్థాయిలో బలపడాలనే యోచనలో బీజేపీ

వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి రావడంతో ఈసారైనా క్షేత్రస్థాయిలో బలపడాలని భారతీయ జనతా పార్టీ ఆలోచనలో ఉంది. ఇప్పటికీ ఆ పార్టీ పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ప్రభావం చూపిస్తోంది. కానీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మండల, గ్రామ స్థాయిలో పార్టీని విస్తరించేందుకు మంచి అవకాశంగా చూస్తోంది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ అంటే కాంగ్రెస్, వామపక్షాలు, ఒకప్పుడు టీడీపీ అన్నట్టుగా ఉండేది. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత కాంగ్రెస్, వామపక్షాలు, బీఆర్‌ఎస్‌లు బలమైన పార్టీలుగా ఉండగా, ఆ స్థాయిలో బీజేపీకి బలం ఉండేది కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. గ్రామస్థాయిలో సర్పంచ్, వార్డు మెంబర్లుగా బీజేపీ తరఫున నిలబడేందుకు ఆసక్తి చూపిస్తున్న ఆశావహుల సంఖ్య పెరిగింది. ఇలాంటి వారిని గుర్తించి అధిక స్థానాల్లో విజయం సాధించడం ఎలా అన్న అంశంపై ఆ పార్టీ అగ్రనాయకత్వం దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో జిల్లాకు కొత్త అధ్యక్షుడిగా బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేతికి పగ్గాలు అప్పగించింది. ఆ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచంద్రరావు సైతం రెండు రోజులపాటు జిల్లాలో పర్యటించి ఆ పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం నింపారు.

గుంభనంగా కాంగ్రెస్

తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటి నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కంచుకోటగా ఉంటోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీకి చేదు ఫలితాలు ఎదురైనా ఈ జిల్లాలో అంచనాలకు మించి సానుకూల ఫలితాలు సాధించింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వాటిని ఎదుర్కోవడం ఆ పార్టీ సిద్ధంగా ఉంది. అయితే ఎప్పటిలాగే ఆ పార్టీ నుంచి ఆశావహులు ఎక్కువగా ఉండటం, అందులో నుంచి అభ్యర్థులను ఎంపిక చేయడమే సమస్యగా మారనుంది. పైగా అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇతర పార్టీల నుంచి భారీ స్థాయిలో కాంగ్రెస్‌లో చేరికలు జరిగాయి. దీంతో కొత్త, పాత నేతల మధ్య సమన్వయం మరో సవాల్‌గా ఆ పార్టీ ముందు నిలిచింది. దీంతో ముందే ఎన్నికల హడావుడి చేస్తే ఎదురయ్యే అంతర్గత సమస్యల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ గుంభనంగా ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన మరుక్షణం తడాఖా చూపిస్తామని ఆ పార్టీ శ్రేణులు అంటున్నాయి.

కాంగ్రెస్ వైఫల్యాలు లాభిస్తాయని బీఆర్‌ఎస్ అంచనా..

ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి సైతం ఎన్నికల కోసం ఎదురు చూస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ వైఫల్యాలు తమకు లాభిస్తాయని ఆ పార్టీ అంచనాతో ఉంది. దీనికి తోడు పార్టీ ఫిరాయింపుల కేసులో తాజాగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో భద్రాచలం అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు వస్తాయనే అంచనాతో ఆ పార్టీలో వేడిని పెంచాయి.

పాలక మండలి ఏర్పాటెప్పుడో..?

- శ్రీసీతారామ చంద్రస్వామి ట్రస్ట్ బోర్డుకు గత డిసెంబర్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఏడు నెలలు గడిచినా పూర్తికాని ప్రక్రియ
- ఎదురుచూస్తున్న ఆశావహులు, భక్తులు



రామాలయం

భద్రాచలం: ఏళ్ల తరబడి భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన పాలకమండలిని ఏర్పాటు చేయడంలేదు. పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ట్రస్టు బోర్డు ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరించినా నియామక ప్రక్రియను అటకెక్కించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 13వ ట్రస్ట్ బోర్డు 2010, నవంబర్ 26 నుంచి 2012, నవంబర్ 25 వరకు పనిచేసింది. రామాలయంలో చివరి ట్రస్టు బోర్డు అదే. తెలంగాణ ఏర్పడ్డాక రెండు సార్లు అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ట్రస్టు బోర్డును మాత్రం నియమించలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర ఆలయాలతోపాటు శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి గత డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తులు కూడా స్వీకరించింది. కానీ పాలకమండలిని ప్రకటించలేదు. జిల్లాలో కేవలం పెద్దమ్మగుడి ఆలయానికి మాత్రమే పాలకమండలిని ఏర్పాటు చేసింది.

ఆశలు పెంచుకుని.. అలసిపోయి..

ట్రస్టు బోర్డు పదవుల కోసం కాంగ్రెస్ వాదులు, పార్టీ మారివచ్చిన జంప్ జిలానీలు ఆశలు పెట్టుకున్నారు. దరఖాస్తులూ సమర్పించారు. చైర్మన్, పాలక మండలి సభ్యుల పోస్టులకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పైరవీలు చేశారు. 50 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నా చైర్మన్ గిరి కోసం ఐదుగురు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇదే సమయంలో పెద్దమ్మతల్లి దేవస్థాన పాలకమండలిని ప్రకటించడం, వివాదం చెలరేగి మరో కమిటీ ప్రకటించడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో రామాలయ పాలక మండలిని ప్రకటించలేదనే అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో రాజధాని, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఆశావహులు అలసిపోయి నిరాశగా ఎదురుచూస్తున్నారు.

పాలకమండలితో అభివృద్ధి సవ్యంగా..

రామాలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. మాఢ వీధుల విస్తరణకు నిధులను కేటాయించి భూ సేకరణ సైతం పూర్తి చేసింది. మాస్టర్‌ప్లాన్ రూపొందించాల్సి ఉంది. మరో రెండేళ్లలో గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాలకమండలిని నియమిస్తే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించేలా మాస్టర్ రూపకల్పనలో, పుష్కరాల విజయవంతంలో కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధి పనులు సవ్యంగా సాగేలా చూడవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం ట్రస్టు బోర్డును ప్రకటించాలని భక్తులు, ఆశావహులు కోరుతున్నారు.

అభివృద్ధికి దోహదం



ప్రభుత్వం జాప్యం చేయకుండా రామాలయ పాలకమండలిని ప్రకటించాలి. ట్రస్ట్ బోర్డు ఏర్పడితే ఆలయ అభివృద్ధి వేగవంతంతోపాటు గోదావరి పుష్కరాల విజయవంతానికి దోహదం చేస్తుంది.

– జోగారావు, స్థానికుడు

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. ఆతర్వాత అర్చకులు స్వామి వార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

కేబిన్‌తో మార్కెట్ చెక్ పోస్టులు

రూ. 3 లక్షలతో మూడు చోట్ల ఏర్పాటుకు ఇల్లెందు మార్కెట్ కమిటీ చర్యలు



చెక్ పోస్టు కోసం సిద్ధం చేస్తున్న కేబిన్

ఇల్లెందు: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌కు చెక్ పోస్టులు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్నాయి. 2023–24లో ఇల్లెందు మార్కెట్ ఆదాయం రూ.3.24 కోట్లు కాగా, చెక్ పోస్టుల ద్వారా రూ 0.91 లక్షలు చేకూరింది. 2024–25 సంవత్సరంలో రూ.5.14 కోట్ల ఆదాయం రాగా చెక్ పోస్టుల నుంచి రూ.1.08 కోట్ల ఆదాయం వచ్చింది. మార్కెట్‌కు పట్టణంలోని సుభాష్‌నగర్ కూడలి, బొమ్మనపల్లి, ముచ్చర్ల, బయ్యారంలో చెక్ పోస్టులు ఉన్నాయి. వీటిలో సుభాష్‌నగర్, బొమ్మనపల్లి, బయ్యారం చెక్ పోస్టులు తాత్కాలిక రేకుల షెడ్డులో కొనసాగుతున్నాయి. చలి, ఎండ, వానల నుంచి రక్షణలేక సిబ్బంది అవస్థ పడుతున్నారు. ఈ క్రమంలో చెక్ పోస్టులను పటిష్టపరిచేందుకు మార్కెట్ కమిటీ చర్యలు చేపట్టింది. మూడింటిని త్వరలో కేబిన్ చెక్ పోస్టులుగా మార్చనుంది. ఒక్కో కేబిన్‌కు రూ.లక్ష ఖర్చు చేస్తున్నారు. నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. నిర్మాణం పూర్తయ్యాక చెక్ పోస్టు ప్రదేశానికి తరలించి పునాది నిర్మించి, దానిపై కేబిన్ ఏర్పాటు చేయనున్నారు. కేబిన్‌లో బెడ్, టేబుల్, కుర్చీ, ఫ్యాన్, కూలర్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పటిష్ట రక్షణ చర్యలతో..



మార్కెటింగ్ చెక్ పోస్టుల్లో సిబ్బంది రాత్రి, పగలు విధులు నిర్వర్తిస్తున్నారు. వారి రక్షణకు, దస్త్రాల భద్రతకు పటిష్టమైన రక్షణ కల్పించేలా కేబిన్లు ఏర్పాటు చేస్తున్నాం. ఎండ, వాన, చలికి భయపడాల్సిన అవసరం లేదు. ఫైళ్లు, నగదు భద్రపర్చుకోవచ్చు. జిల్లాలో తొలిసారిగా ఇల్లెందు మార్కెట్ పరిధిలోనే కేబిన్‌లు ఏర్పాటు చేస్తున్నాం.

– ఈ.నరేష్, సెకండ్ గ్రేడ్ సెక్రటరీ, మార్కెట్ యార్డు, ఇల్లెందు

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒక్కరోజు ఆదాయం రూ.56,170



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. కిన్నెరసాని ప్రాజెక్ట్, డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ప్రకృతి అందాల నడుమ ఆహ్లాదం పొందారు. 489 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.25,770 ఆదాయం లభించగా, 320 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.15,010 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పేదలందరికీ గూడు కల్పిస్తాం

- రాష్ట్రంలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు
- 95 లక్షల రేషన్ కార్డులు, 51 లక్షల కుటుంబాలకు 'గృహజ్యోతి'
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- కమలాపురంలో గోదాం నిర్మాణానికి భూమి పూజ



కమలాపురంలో గోదాంల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ముదిగొండ : ప్రతీ పేదవాడికి గూడు నిర్మించే సంకల్పంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మండలంలోని కమలాపురంలో రూ.10 కోట్లతో నిర్మించే 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సకాలంలో సాగునీటి సరఫరా, రుణమాఫీ, రైతు భరోసా వంటి కార్యక్రమాల అమలుతో దేశంలోనే అత్యధికంగా వరి పండించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. సీతారామ ప్రాజెక్టుతో జిల్లా భూములు సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కింద తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లి నీరు తెచ్చేలా చేసిన డిజైన్‌ను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులతో ఒక్క చుక్క నీరు కూడా ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తే నీటికి ఇబ్బంది ఉండేది కాదన్నారు. రాజకీయ విమర్శలకు తావు లేకుండా బనకచర్ల ప్రాజెక్టును ప్రతీ ఒక్కరూ వ్యతిరేకించాలని అన్నారు. రాష్ట్రంలో 95 లక్షల పేద కుటుంబాలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 51 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలు ఒకే చోట చదువుకునేలా 104 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు నిర్మిస్తున్నామని వివరించారు. మహిళా సంఘాలకు రూ.21వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని, ఐదేళ్లలో రూ.లక్ష కోట్లకు పెంచుతామని చెప్పారు. కమలాపురంలో చేపట్టిన గోదాముల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గోదాముల నిర్మాణం పూర్తయితే రైతులు పండించే వరి, ఇతర పంటల నిల్వలకు ఇబ్బంది ఉండదని అన్నారు. సన్న ధాన్యానికి రూ. 500 బోనస్‌తో వరి ఉత్పత్తి పెరుగుతోందని చెప్పారు. అనంతరం పెదమండవ ఎస్సీ కాలనీలో రూ.58.50 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి బోర్డును ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎండీ లక్ష్మి, హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఖమ్మం సీపీ సునీల్‌దత్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ కళావతి బాయి, డీఎంఓ ఎంఏ. అబ్దుల్ అలీమ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నాయకులు మందడపు నాగేశ్వరరావు, వనం నర్సింగరావు, పల్లూరి భద్రారెడ్డి, వనం ప్రదీప్త చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మావోయిస్టు పార్టీ వారోత్సవాలు

చర్ల: మావోయిస్టు పార్టీ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 28 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించాలంటూ మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో సరిహద్దుతో పాటు చర్ల మండలంలో పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. మావోయిస్టులు విధ్వంసాలకు దిగవచ్చనే అనుమానంతో భద్రత కట్టుదిట్టం చేశారు. సరిహద్దు గ్రామాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నిలిపివేసి, యంత్ర పరికరాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు, భవనాలపై నిఘా పెంచారు. పెద్ద ఎత్తున గస్తీ నిర్వహించారు. వారం రోజులపాటు కొనసాగిన మావోయిస్టు వారోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, అధికార పార్టీ నాయకులు ఊపిరిపీల్చుకున్నారు.

చెట్టు కాదు.. పైపే !

ఆకుల తీగ అల్లుకుని ఇలా ఎత్తుగా కనిపిస్తోంది చెట్టు అనుకుంటే పొరపాటే. పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన ఎయిర్ వాల్వ్ పైప్ ఇది. 2008లో కిన్నెరసాని రిజర్వాయర్ ఎండిపోగా, కేటీపీఎస్‌కు గోదావరి జలాలను సరఫరా చేసేందుకు నాటి సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి రూ.100 కోట్లు కేటాయించారు. దీంతో బూర్గంపాడు మండల పరిధిలోని గోదావరి నుంచి కేటీపీఎస్ వరకు భారీ పైప్‌లైన్ వేశారు. అక్కడక్కడా ఇలా ఎయిర్ వాల్వ్‌లు ఏర్పాటు చేయగా.. పాల్వంచలో వేసిన పైప్‌కు ఇలా తీగ అల్లుకోవడంతో చెట్టును తలపిస్తోంది.

– పాల్వంచరూరల్



పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పైపులైన్‌కు అల్లుకున్న చెట్టు తీగ

ఆస్పత్రుల అభివృద్ధిపై సర్కారు దృష్టి

ఆర్టీఐ కమిషనర్ పి.వి.శ్రీనివాస్

తిరుమలాయపాలెం: గ్రామీణ, పట్టణ ప్రాంత ఆస్పత్రుల అభివృద్ధితో పాటు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన తిరుమలాయపాలెం సీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రిలో అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు విధిగా చేయాలని, తక్షణమే వైద్య సేవలు అందించి సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వెళ్లేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. డెంగీ వంటి సీజనల్ జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని చంద్రుతండా, అజ్మీరతండా గ్రామాల్లో ఇప్పటికే డెంగీ కేసులు నమోదయ్యాయని, ఇకపై కేసులు పెరగకుండా అదుపు చేయాలని అన్నారు. సిబ్బంది స్థానికంగా ఉండాలన్నారు. సీహెచ్‌సీలో సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చర్యలు చేపట్టారని తెలిపారు. అనంతరం ఆపరేషన్ థియేటర్, డెలివరీ గది, వార్డు, ఫార్మసీ, రక్త నమూనాలు సేకరించే ల్యాబ్‌ను పరిశీలించారు. సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చందూనాయక్, వైద్యులు బొల్లికొండ శ్రీనివాసరావు, కృపాఉషశ్రీ, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, కమ్మకోమటి నాగేశ్వరరావు, చంద్రశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న పి.వి.శ్రీనివాస్

క్లుప్తంగా

బాలిక ఆత్మహత్య

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడు లోని గౌతమిపురం కాలనీకి చెందిన ఓ బాలిక (12) ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం.. మధ్యాహ్నం వరకు స్నేహితులతో ఆడుకున్న బాలిక ఆ తరువాత ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరు లేనిసమయాన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన బాలిక తండ్రి గతేడాది ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. నాటి నుంచి బూర్గంపాడులోని అమ్మమ్మ వాళ్ల ఇంటి దగ్గర తల్లితో కలిసి ఉంటుంది. కాగా, బాలిక మృతికి గల కారణాలు తెలియరాలేదు. తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక తీవ్ర మనస్తాపానికి గురవుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లుగా స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనపై తమకు సమాచారముందని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తామని ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపారు.

ఒంటరి తనం తాళలేక వ్యక్తి..

పాల్వంచ: భార్య, భర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో విడిగా ఉంటున్న ఓ వ్యక్తి ఒంటరి తనం తాళలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక శ్రీనివాస బంజారా కాలనీకి చెందిన అవస్నీరు శివకుమార్(39)కు గత తొమ్మిదేళ్ల క్రితం సరితతో వివాహమైంది. అనంతరం చెన్నైలో ఉంటు వీడియోగ్రాఫర్‌గా పనిచేశాడు. ఇటీవల భార్యతో విభేదాలు రావడంతో విడిగా ఉంటున్నారు. గత పది రోజుల క్రితం శివకుమార్ పాల్వంచ శ్రీనివాస బంజరా కాలనీలోనే ఓ రూమ్ అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం అదే గదిలో వైర్‌తో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒంటరి తనం, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని తమ్ముడు వరదరాజు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెడ్డిచెరువులో సోదరులు గల్లంతు?

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన మత్స్యకారులు, సోదరులు కంభం నాగేశ్వరరావు, సత్యం రెడ్డిచెరువులో గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కంభం నాగేశ్వరరావు గ్రామంలోని రెడ్డిచెరువును లీజుకు తీసుకుని చేపల పెంపకం చేపట్టాడు. రోజూ మాదిరిగానే తన తమ్ముడు సత్యంతో కలిసి ద్విచక్ర వాహనంపై చెరువు వద్దకు వెళ్లారు. చీకటి పడినప్పటికీ వారు ఇంటికి రాక పోవటంతో కుటుంబ సభ్యులు ఫోన్‌చేయగా స్విచ్‌ఆఫ్ రావటంతో ఆందోళనతో చెరువు వద్దకు వెళ్లా రు. చెరువు కట్టపై ద్విచక్ర వాహనం, దుస్తులు, చెప్పులు విడిచి ఉండటాన్ని గుర్తించి గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగుల్‌మీరా చెరువు వద్దకు చేరుకుని స్థానికుల సహకారంతో నాటు పడవల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. రాత్రి సమయం కావటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు.

పామాయిల్ గెలలు 

టన్ను ధర	రూ.18,052

పోడు భూములు పచ్చగా..

- 'ఇందిరా సౌర గిరి జలవికాసం' ద్వారా అభివృద్ధికి ప్రణాళిక
- నీటి పారుదలకు సోలార్ పంపుసెట్ల మంజూరు
- ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో 73,733 మంది రైతులకు లబ్ధి
- 2.23 లక్షల ఎకరాల మేర సాగుకు ప్రయోజనం





ఖమ్మంవ్యవసాయం: పోడు భూముల(ఆర్ఓఎఫ్ఆర్)ను ఉద్యాన వనాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిరా సౌర గిరి జల వికాసం'పథకాన్ని రూపొందించింది. ఆర్ఓఎఫ్ఆర్ (రికగ్నైజేషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) భూములు గిరిజన ప్రాంతంలో ఉండటం, ఆయా భూములను గిరిజనులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తుండటంతో 2006లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హక్కులు కల్పించారు. గిరిజనులు ఆ భూముల్లో వర్షాధారంగా మెట్ట పంటలను సాగు చేస్తున్నారు. సారవంతమైన ఈ భూములను అభివృద్ధి చేసేందుకు ఐదేళ్ల ప్రణాళికతో ఈ పథకానికి రూపకల్పన చేసి, అమలు బాధ్యత గిరిజనాభివృద్ధి సంస్థకు అప్పగించింది. రాష్ట్రంలో 2,30,735 మంది గిరిజన రైతులకు చెందిన 6.69 లక్షల ఎకరాల భూమిని రూ.12,600 కోట్లతో అభివృద్ధి చేసి, ఉద్యాన వనాలను పెంచా లని నిర్ణయించింది. రాష్ట్రంలోని 17జిల్లాల్లో ఉన్న పోడు భూముల అభివృద్ధికి ఈ పథకాన్ని వర్తింప జేసే విధంగా ప్రణాళిక రూపొందించారు. 2025–26 నుంచి 2029–30 వరకు అమలు చేయనున్న ఈ పథకంలో తొలి ఏడాది ప్రయోగాత్మకంగా తక్కువ మంది రైతులు, తక్కువ విస్తీర్ణంలో.. తరువాత నాలుగేళ్లలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోనున్నారు. తొలి ఏడాది 10 వేల మంది రైతులకు చెందిన 27,184 ఎకరాల్లో పథకాన్ని అమలు చేసే విధంగా రూ.600 కోట్లతో అంచనాలు రూపొందించారు.

తిరిగి పచ్చదనం

పూర్వం దట్టమైన అడవులతో ఉన్న భూములను ఆయా ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు జీవనోపాధి కోసం సాగు భూములుగా మార్చుకున్నారు. దీంతో అడవులు క్రమంగా అంతరించి, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. ఈ పథకంలో భాగంగా పోడు భూముల అభివృద్ధి, ఉద్యాన పంటల సాగును చేపట్టనుండటంతో గిరిజనుల జీవనోపాధి మెరుగుపర్చడమే కాకుండా తిరిగి ఆ భూములు అడవులను తలపిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రోత్సాహకాలు అందించి ఆయిల్ పామ్, మామిడి, జామ, సపోట వంటి తోటలను పండించేలా చర్యలు చేపడుతున్నారు.

సోలార్ పంపుసెట్ల మంజూరుకు ప్రణాళిక

పథకంలో భాగంగా నీటి సౌకర్యం రెండున్నర ఎకరాలను ఒక యూనిట్‌గా తీసుకుని, వంద శాతం సబ్సిడీతో సోలార్ పంపుసెట్‌ను అందిస్తారు. ఒక యూనిట్‌కు రూ.6 లక్షల వ్యయంతో 200 అడుగుల లోతు బోరుగుంత తీసి, కేసింగ్ వేసి, పంపుసెట్ ఏర్పాటు చేస్తారు. సోలార్ పలకలు అమర్చి, ఇన్వర్టర్ ఏర్పాటు, పంపుసెట్, సోలార్ పలకల చుట్టూ ఫెన్సింగ్ వంటి నిర్మాణాలు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని ఎంపిక చేసిన కంపెనీలు ఐదేళ్ల పాటు నిర్వహిస్తాయి. ఐదేళ్ల కాలంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 73,733 మంది రైతులకు చెందిన 2.23 లక్షల ఎకరాలకు అమలు చేయనున్నారు. ఖమ్మం జిల్లాలో 11,386 మంది రైతులకు చెందిన 27,448 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 62,347మంది రైతులకు చెందిన 1,95,998 ఎకరాల పోడు భూముల్లో పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ ఏడాది మాత్రం ఖమ్మం జిల్లాలో 550 మంది రైతులకు చెందిన 1,516 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,923 మంది రైతులకు చెందిన 8,046 ఎకరాల్లో అమలు చేయాలని నిర్ణయించారు.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఐదేళ్ల పాటు 'ఇందిరా సౌర గిరి జలవికాసం'ప్రణాళిక

	ఖమ్మం జిల్లా		భద్రాద్రి కొత్తగూడెం జిల్లా	
సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	ఎకరాలు	లబ్ధిదారుల సంఖ్య	ఎకరాలు
2025-26	550	1,516	2,923	8,046
2026-27	2,809	6,483	14,856	46,988
2027-28	2,809	6,483	14,856	46,988
2028-29	2,809	6,483	14,856	46,988
2029-30	2,809	6,483	14,856	46,988
మొత్తం	11,786	27,448	62,347	1,95,988

మార్గదర్శకాలు అందాల్సి ఉంది..



ఇందిర సౌర గిరి జల వికాసం పథకం అమలులో భాగంగా సోలార్ పంపుసెట్ల ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి మార్గ దర్శకాలు అందాల్సి ఉంది. వాటి ఆధారంగా ఎంపిక చేసిన లబ్ధిదారుల పోడు భూముల్లో సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. పలు కంపెనీల ద్వారా సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

–పి. అజయ్‌కుమార్, రెడ్‌కో మేనేజర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

13 కిలోల ఎండుగంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి,నిందితులను చూపిస్తున్న అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం మీదుగా ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి నుంచి హైదరాబాద్, మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత ఎండు గంజాయిని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సీహెచ్.శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులో రూట్ వాచ్‌తో పాటు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఒక కారు, ద్విచక్ర వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీ చేయగా బ్యాగులో 13.130 కిలోల ఎండు గంజాయి లభించింది. వాహనాలలో ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరిని చెందిన సయ్యద్ యూనిస్ మాలిక్, బోధ పవన్‌లు తేలింది. ఇందులో మరో వ్యక్తి కోన ఉమామహేశ్వరరావు పరారీలో ఉండగా.. ఇద్దరిని అరెస్ట్ చేసి భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. పట్టుబడిన గంజాయి, హోండా సిటీ కారు, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. గంజాయి విలువ సుమారు రూ.12 లక్షల వరకు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కరీం, కానిస్టేబుళ్లు సుధీర్, వెంకట్, హరీష్, వీరబాబు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామవరంలో 300 గ్రాముల గంజాయి..

కొత్తగూడెంటౌన్: గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను రామవరం టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ ప్రతాప్ కథనం ప్రకారం.. రామవరం నాగయ్యగడ్డ బస్తీ శివారు గరీబ్‌పేటకు వెళ్లే దారిలో ఎస్సై బి.కిశోర్ బృందం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న చెట్ల మధ్య నాగయ్యబస్తీకి చెందిన ముగ్గురు యువకులు కాంద్రేగుల నాగ అఖిల్ అలియాస్ మెంటూ, గరీబ్‌పేటకు చెందిన పర్లపల్లి ఉదయ్‌కుమార్ అలియాస్ భూపతి, ఉదయ్‌లు అనుమానాస్పదంగా కనిపించగా.. వారిని విచారించడంతో పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో ఆ ముగ్గురి దగ్గర ఉన్న ప్లాస్టిక్ బ్యాగ్‌లను తీసుకునేందుకు ప్రయత్నించగా.. ఒక వ్యక్తి పరారు కాగా నాగఅఖిల్, ఉదయ్‌లను పట్టుబడ్డారు. వారిద్దరి వద్ద నుంచి రూ.15వేలు విలువైన 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, మూడవ వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు సీఐ ప్రతాప్ తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుళ్లు బలరాం రాజు, కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, రాజా, బుచ్చిరాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్ట్..

బూర్గంపాడు: మండలంలోని తాళ్లగొమ్మూరులో కోడిపందేలు ఆడుతున్న ఆరుగురిని ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ మేడ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లగొమ్మూరులో కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,500 నగదు, ఆరు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మరో ఐదుగురు వ్యక్తులు పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్లాక్‌మెయిల్ కేసులో హోటల్ సిబ్బంది..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కల్యాణ మండపం రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ లాడ్జిలో యువతీ,యువకుల ప్రైవేట్ వీడియో తీసి బ్లాక్‌మెయిల్ చేసిన హోటల్ సిబ్బందిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఎం.నాగరాజు కథనం ప్రకారం.. ఏప్రిల్ 16న మహ్మద్ హర్షద్ భద్రాచలం రామయ్యను దర్శించుకుని స్థానిక ఒక లాడ్జిలో రూమ్ తీసుకుని బస చేశారు. ఈ క్రమంలో హోటల్ సిబ్బంది వారి అనుమతి లేకుండా సీక్రెట్ కెమెరాలతో వారిద్దరి సన్నిహితంగా ఉన్న క్షణాలను రికార్డ్ చేసి ఫొటోలు తీశారు. అనంతరం కొన్ని రోజుల తర్వాత వీడియోలు, ఫొటోలతో హర్షద్‌ను బెదిరించడం మొదలు పెట్టారు. దీంతో హర్షద్ హోటల్ సిబ్బందికి సుమారు రూ.60 వేలు చెల్లించాడు. అయినా వారి వేధింపులు ఆపకపోవడంతో హర్షద్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా.. హోటల్ యజమాని పడాల వెంకటరామిరెడ్డి, హోటల్ మేనేజర్ సురగం భార్గవ్‌లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఘర్షణలో ఐదుగురిపై కేసు నమోదు

చంద్రుగొండ: మండలంలోని గానుగపాడులో ఆదివారం జరిగిన ఘర్షణలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం మద్రిగూడెం గ్రామానికి చెందిన కిలారి ఉదయ్‌కుమార్, సుస్మిత భార్యభర్తలు. వీరిద్దరి మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో శనివారం వారిద్దరి మధ్య గొడవ జరగ్గా.. సుస్మిత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె తల్లిగారి ఊరైన వైరా మండలంలోని కొండకుడిమ గ్రామానికి వెళ్లి అత్తమామలను ఆరా తీయగా.. మా కూతురు రాలేదని వారు చెప్పారు. దీంతో అమ్మమ్మ గ్రామమైన చంద్రుగొండ మండలంలోని గానుగపాడు గ్రామానికి వచ్చి సుస్మిత గురించి ఆచూకీ అడగ్గా.. కోపోద్రిక్తులైన వారు ఉదయ్‌కుమార్‌తో పాటు అతడి తమ్ముడు సందీప్‌ను చితకబాదారు. ఈ కేసులో రాచబంటి వీరయ్య, వెంకయ్య, సునీల్, నర్సింహారావు, పద్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్ననట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పాల్వంచరూరల్: కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని కిన్నెరసాని వాగు నుంచి అక్రమంగా ఇసుకను ఉల్వనూరు వైపు తరలిస్తున్న ట్రాక్టర్‌ను రాజాపురం వద్ద ఎస్ఐ సురేశ్ పట్టుకుని తనిఖీ చేశారు. దీంతో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి వారు ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తోకల రంజిత్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

పెనుబల్లిలో..

కొత్తగూడెంటౌన్: ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా.. ఆదివారం రామవరం టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. పెనుబల్లిలోని ముర్రేడు వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా.. సీఐ ప్రతాప్ ఆధ్వర్యాన తనిఖీ చేసి పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న డ్రైవర్ కంగాల వంశీ, యజమాని కంటె రామారావులన కూడా అరెస్టు చేసినట్లు సీఐ ప్రతాప్ తెలిపారు.ఈతనిఖీల్లో కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, రాజా, వీరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నేలకొండపల్లి: కోనాయిగూడెం గ్రామానికి చెందిన గ్రామదీపిక, మాజీ ఎంపీటీసీ కొమ్మినేని పుష్పావతి స్కూటీపై వెళ్తుండగా గేదెలు అడ్డు వచ్చాయి. దీంతో అదుపుతప్పి కిందపడగా.. గాయమైంది. ఆమెను మాజీ సర్పంచ్‌లు పుల్లమ్మ, పాపయ్యతో పాటు వి.నర్సయ్య తదితరులు పరామర్శించారు.

బాలుడికి పాముకాటు..

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం



చికిత్స పొందుతున్న బాలుడు

అశ్వారావుపేటరూరల్: ఆటాడుకుంటున్న ఓ బాలుడు పాముకాటుకు గురి కాగా, ఓ ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్తే విధుల్లో ఉన్న సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధితుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట మండలంలోని బచ్చువారిగూడెం గ్రామ పంచాయతీ పరిధి కొత్త వాగొడ్డుగూడెం గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలుడు మడకం బాబీ ఆదివారం ఉదయం ఇంటి సమీపాన తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. ఈక్రమంలో పాముకాటుకు గురికాగా.. తల్లిదండ్రులు హుటాహుటిన సమీపంలోని గుమ్మడవల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈసమయాన ఆస్పత్రిలో విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది బాలుడిని పట్టించుకోకుండా.. కనీసం ప్రథమ చికిత్స కూడా చేయకుండా వైద్యులు, మందులు లేవని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పారని బాధిత కుటుంబీకులు వాపోయారు. బాలుడిని అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కాగా, వైద్యాధికారులు విధుల్లో లేకపోవడంతో పాటు సిబ్బంది కనీసం పట్టించుకోలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది. దీనిపై గుమ్మడవల్లి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి వెంకటేశ్వరరావు వివరణ కోసం 'సాక్షి'ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

పోలీసుల అదుపులో దొంగల ముఠా



పట్టుబడ్డ నిందితులతో ఎస్సై, పోలీసులు

దమ్మపేట: దొంగిలించిన బంగారు నగలను విక్రయించడానికి వెళ్తున్న ఓ ముఠాను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. దమ్మపేట ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఇటీవల మండలంలోని బాలరాజుగూడెం గ్రామంలో ఓ ఇంటిలో బంగారు నగలను చోరీ చేసిన కొమ్మనబోయిన సీతారాములు ఆ నగలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, కల్లూరుకు చెందిన నలుగురు వ్యక్తులకు (ముగ్గురు పురుషులు, ఒక మహిళ) విక్రయించమని ఇచ్చాడు. దీంతో ఆ నలుగురు ఆటోలో సత్తుపల్లి నుంచి ఏపీ, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంకు బయలుదేరారు. ఈ క్రమంలో వారు మండలంలోని మొద్దులగూడెం క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసుల వద్ద తారసపడ్డారు. ఆటోలో ఉన్న ఈ నలుగురి ప్రవర్తన అనుమానస్పదంగా ఉండటంతో వా రిని పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారించారు. వారి వద్ద ఉన్న 92 గ్రాముల బంగారు ఆభరణాలు(నల్లపూసల గొలుసు, నెక్లెస్, సాదా గొలుసు), మొబైల్ ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ప్రధాన నిందితుడు సీతారాములు పరారీలో ఉండగా.. ఈ నలుగురిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపామని ఎస్సై తెలిపారు.

మధిర పట్టణంలో చోరీ

మధిర: పట్టణంలోని నందిగామ బైపాస్ రోడ్డు సమీపంలోని ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చెరుకూరి నాగార్జున శనివారం హైదరాబాద్ వెళ్లగా ఆయన సతీమణి లక్ష్మి ఎన్టీఆర్‌జిల్లా వత్సవాయి మండలం మక్కపేటలోని పుట్టింటికి వెళ్లింది. గుర్తుతెలియని దుండగులు అదే రోజు రాత్రి తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ.1.20 లక్షల నగదు, 4 బంగారు గాజులు, నల్లపూసల గొలుసు చోరీచేశారని, సుమారు రూ.9లక్షల సొత్తును అపహరించినట్లు బాధితుడు తెలిపారు. మరో గది తలుపు గడియ పగలగొట్టి దుస్తులు, వస్తువులను చిందరవందర చేశారు. ఘటనా స్థలాన్ని టౌన్ ఎస్‌హెచ్ఓ రమేశ్‌తో పాటు ఖమ్మం నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు.

మల్చింగ్ సాగు.. బాగు



నేలపై పరిచిన మల్చింగ్, (ఇన్‌సెట్) మల్చింగ్ విధానంలో బొప్పాయిసాగు

- కలుపు, చీడపీడల సమస్యకు చెక్
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- ఆసక్తి చూపుతున్న ఏజెన్సీ రైతులు

ఇల్లెందురూరల్: రైతులు సాగు చేసిన పంటలపై వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపిస్తుంటాయి. దీనికి తోడు తెగుళ్లు, చీడపీడల బెడద వంటి పలు కారణాలతో దిగుబడులు తగ్గి పెట్టుబడులు కూడా చేతికందక నష్టపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు క్రమంగా సాంకేతిక సాగు పద్ధతులు అవలంభిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఘడించేలా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. విపత్తులను తట్టుకుంటూ చీడపీడలు, కలుపు నియంత్రిస్తూ, తక్కువ మోతాదులో నీటి తడులతో ఆశించిన దిగుబడులు అందించే మల్చింగ్‌సాగు విధానంపై రైతులు దృష్టిసారిస్తున్నారు.

షీట్ల ఎంపిక ఇలా..

ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్లు, పూల మొక్కల సాగులో మల్చింగ్ షీట్లను అధికంగా ఉపయోగిస్తారు. 3 నుంచి 4 నెలల కాలవ్యవధి ఉండే పంటల సాగులో 50 మైక్రాన్ల మల్చింగ్ షీట్లను ఉపయోగిస్తారు. 12 నుంచి 15 నెలల కాల వ్యవధి కలిగిన పంటల సాగులో 100 షీట్లను వాడటం మేలు. 7.25 మైక్రాన్ల మందం కలిగిన షీట్లు ఒక పంట కాలానికి, 50 నుంచి 200 మైక్రాన్ల మందం కలిగిన షీట్లు మూడేళ్ల వరకు మన్నిక కలిగి ఉంటాయి.

సాగు విధానం..

మల్చింగ్ పరిచే విధానం పలు రూపాలలో ఉంటుంది. విత్తనం వేయక ముందు, వేసిన తరువాత కూడా మల్చింగ్ షీట్లను కప్పేందుకు అవకాశం ఉంటుంది.

- మొక్క పాదుకు సరిపడా షీట్‌ను కత్తిరించి మధ్యలో గుండ్రంగా మొక్క కాండానికి సరిపడా రంధ్రం చేసి బయటకు చీలిక చేయాలి.
- చీలిక గుండా కాండం మధ్యలోకి వచ్చేలా తొడిగి మట్టితో షీట్ అంచులు కప్పడంతో పాటు మూడు, నాలుగు అర్ధచంద్రాకారంలో రంధ్రాలు చేస్తే భూమిలోకి నీరు ఇంకుతుంది.
- కూరగాయల పంటల్లో విత్తనాలు విత్తేముందు మొక్క మధ్యలో వరుసల మధ్య ఉన్న దూరాన్ని బట్టి ముందే షీట్‌కు రంధ్రాలు చేయాలి.
- షీట్‌ను నాగలి సాలు మీద పరిచి రెండు వైపులా కొనలపై మట్టి ఎగదోస్తే కవర్లు కొట్టుకుపోకుండా ఉంటాయి. ఆతర్వాత రంధ్రాల్లో 2 నుంచి 3 విత్తనాలు వేసి మట్టి కప్పాలి.
- విత్తనాలు మొలిచాక మొక్క చుట్టూ షీట్‌ను తగిన సైజులో కత్తిరించి ప్రతి మొక్క మొదటలో వచ్చేలా తొడగాలి.
- ఈ షీట్‌ను ప్రతీ వరుసలో లేదా చెట్టు దగ్గర మరీ వదులుగా లేదా బిగుతుగా లేకుండా కప్పి అన్ని చివరలకు గాడిలో పోయేలా చేసి మట్టితో కప్పాలి. దీనివల్ల మల్చింగ్ షీటు గాలికి చెదిరిపోకుండా ఉంటుంది.

ప్రయోజనాలిలా..

భూమిపై ప్లాస్టిక్ షీట్ కప్పి బయటి వాతావరణానికి సంబంధం లేకుండా నేలలోని ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరిస్తుంది. సూర్యకిరణాలను మొక్క ప్రతి భాగానికి అందించి అనుకూలమైన పరిస్థితులను ఏర్పర్చడానికి వీలు కలుగుతుంది. కలుపు నివారణ 80 శాతం తగ్గుతుంది. 50శాతం వరకు సాగునీటి ఆదాతో పాటు తెగుళ్ల నివారణకు దోహదపడుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో సాగుచేసే రైతులకు ప్రయోజనం చేకూర్చుతుంది.

ఏజెన్సీ రైతుల్లోనూ ఆసక్తి..

వ్యాపార పంటలు అధికంగా సాగు చేస్తున్న ప్రాంతాలకే పరిమితమైన మల్చింగ్ సాగు విధానం ప్రస్తుతం క్రమంగా ఏజెన్సీ ప్రాంతాలకు విస్తరిస్తోంది. నీటి వనరులు తక్కువగా ఉన్న రైతులు మల్చింగ్, డ్రిప్ వనరులను వినియోగించుకుంటూ పంటల సాగు చేపడుతున్నారు. ఇల్లెందు మండలంలో గతేడాది టమాట పంటకు మల్చింగ్ విధానంతో సాగు ప్రారంభమైంది. చీడపీడలు, కలుపు అంతగా ప్రభావం చూపకపోవడంతో ఈ ఏడాది కాకర, బీర, బొప్పాయి పంటల సాగులో మరికొందరు రైతులు మల్చింగ్ విధానాన్ని అనుసరిస్తున్నారు.

నీటి తడులు పరిమితంగా..



గతేడాది మల్చింగ్ విధానంలో టమాట సాగు ప్రారంభించాను. చేనులో కలుపు బాధ కనిపించలేదు. చీడపీడలు కూడా తక్కువే. నీటి తడులు పరిమితంగానే సరిపోయాయి. ఆశించిన దిగుబడి రావడంతో ఈ ఏడాది కాకర, బీర సాగులోనూ మల్చింగ్ విధానం ఉపయోగించాం.

– బాలు, రైతు, కొమరారం

కలుపు బెడద తీరింది



ఇప్పటివరకు మిర్చి, మొక్కజొన్న పంటలను అధికంగా సాగు చేశాను. ఈఏడాది మూడు ఎకరాల్లో బొప్పాయి సాగు ప్రారంభించాను. మల్చింగ్ విధానంలో మొక్కలు నాటాను. ఇప్పటి వరకు కలుపు నివారణ, నీటి తడులకు పెద్దగా శ్రమ పడలేదు. మొక్కలు ఆశాజనకంగా పెరుగుతున్నాయి.

– సంతు, రైతు, బోయితండా

అవగాహన కల్పిస్తున్నాం..



రైతులు సంప్రదాయ సాగు కంటే శాస్త్రీయ పద్ధతులు అవలంభించి మంచి దిగుబడులు సాధించాలని అవగాహన కల్పిస్తున్నాం. మల్చింగ్ సాగు బహుళ ప్రయోజనాలను అందిస్తోంది. ప్రధానంగాకలుపు నివారణకు మల్చింగ్ ఉపయోగపడుతుంది.

– సతీష్, ఏఓ